



వెలవెలబోతున్న సాత్నాల ప్రాజెక్టు నీటి నిల్వ




● మత్తడివాగు ప్రాజెక్టులో కనిష్ట స్థాయిలోనే కనిపిస్తున్న నీటి నిల్వలు



అన్నదాత.. ఊగిసలాట!

- జిల్లాలో 344.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- వానాకాలం సీజన్ ప్రారంభమై 40 రోజులు
- అయినా.. ఇంకా సాధారణ వర్షపాతమే..
- వర్షం కోసం తప్పని ఎదురుచూపులు
- వెలవెలబోతున్న చెరువులు, కుంటలు, ప్రధాన ప్రాజెక్టులు
- అదునుదాటి పోతోందంటూ రైతుల ఆందోళన
- 35.3 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు
- జిల్లావ్యాప్తంగా రైతులను అతలాకుతలం చేస్తున్న వర్షాభావ పరిస్థితులు



ఆదిలాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభంలో మురిపించిన వర్షాలు మళ్లీ ముఖం చాటేయడంతో సాగు పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ఇప్పటికే అడప దడపగా కురిసిన వర్షాలకు ఆరుతడి పంటలను వేసిన రైతులు ఇక ఆయకట్టు సాగుకు సిద్ధమవుతున్నారు. కానీ ఆశించినస్థాయిలో వర్షపాతం నమోదుకాక పోవడంతో ఊగిసలాటలో పడుతున్నారు. వానకాల సీజన్ ప్రారంభమై 40 రోజులకు పైగా గడిచిపోతున్న.. ఇంకా సాధారణ వర్షపాతమే కనిపిస్తుంది. జూలై 12 వరకు జిల్లా సాధారణ వర్షపాతం 314.7 మి.మీలు కాగా 344.7 మి.మీల వర్షపాతం కురిసింది. దీంతో కనిష్ఠ స్థాయిలో 10.0 మి.మీల వర్షపాతం మాత్రమే నమోదైంది. జిల్లాలో ప్రధానంగా పత్తి, సోయా, కంది, చిరు ధాన్యాల లాంటి వర్షాధార మెట్ట పంటలనే అధికంగా సాగు చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 1193 మి.మీల వర్షాపాతం నమోదయ్యే జిల్లాలో ఈ యేడు జూన్ 1 నుంచి జూలై 12 వరకు 344.7 మి.మీల వర్షపాతం మాత్రమే నమోదైంది. అత్యధికంగా ఉట్నూర్ మండలంలో 466.0 మి.మీల వర్షపాతం కురవగా, అత్యల్పంగా నేరడిగొండ మండలంలో 238.2 మి.మీల వర్షపాతం నమోదు కాగా -22 మి. మీల లోటు వర్షపాతం నమోదైంది. 12 మండలాల్లో సాధారణ వర్షపాతం, 5 మండలాల్లో అధిక వర్షపాతం నమోదుకాగా నేరడిగొండ మండలంలో మాత్రం లోటు వర్షపాతం నమోదైంది. అసలే నీటి వనరులు అంతంత మాత్రంగా ఉన్న జిల్లాలో రైతులను వర్షాభావ పరిస్థితులు అతలాకుతలం చేస్తున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 35.3 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో మొలకెత్తిన పంటలు వాడుముఖం పడుతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు.

పత్తాలేని వర్షపు జాడ

జూన్ 1 నుంచి 25 వరకు జిల్లావ్యాప్తంగా లోటు వర్షపాతమే నమోదైనా.. జూన్ 26నుంచి జూలై 12 వరకు సాధారణ వర్షపాతం కనిపిస్తోంది. జిల్లాలో జూన్ 5వరకు -5 మి.మీ.లు, జూన్ 12వరకు -49 మి.మీ.లు, జూన్ 19వరకు -13 మి.మీ.ల లోటు వర్షపాతం నమోదు కాగా.. జూలై 12వరకు 35మి.మీ.ల సాధారణ వర్షపాతం నమోదైంది. శుక్రవారం జిల్లా సాధారణ వర్షపాతం 13.2 మి.మీ.లు కాగా.. 0.3 మి.మీ.ల లోటు వర్షపాతం నమోదైంది. గతేడు జూలై 15నుంచి 30వరకు భారీ వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. కానీ ఈయేడు కనీసస్థాయిలోనూ నీటి నిల్వలు కనిపించడం లేదు. అడపాదడప కురుస్తున్న వర్షాలకు ఆరుతడి పంటలు ఆశాజనకంగానే కనిపిస్తున్నా.. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల కింద ఆయకట్టు సాగు పనులు ప్రారంభం కావడం లేదు. నీటి వసతి ఉన్న కొంతమంది రైతులు ఇప్పటికే వరి నార్లు పోసి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. నల్ల రేగడి నేలల్లో కొంత తేమ కనిపిస్తున్నా.. ఎర్ర నేలల్లో మాత్రం పంటలు వాడుముఖం పడుతున్నాయి.

కనిష్ఠంగానే నీటి నిల్వలు

జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు ఇంకా కనిష్ఠ స్థాయిలోనే నీటి నిల్వలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా జిల్లాలో ప్రధాన ప్రాజెక్టులుగా చెప్పుకునే సాత్నాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 286.50 మీటర్లు కాగా.. ప్రస్తుతం 281.10 మీటర్ల నీటిమట్టం కనిపిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి కేవలం 60 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. అలాగే మత్తడివాగు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా.. ప్రస్తుతం 275.400 మీటర్లుగా కనిపిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టు ఎలాంటి వరదనీరు రావడం లేదు. అలాగే చెరువులు, కుంటల్లో కనిష్ఠ స్థాయిలోనే నీటిమట్టం కనిపిస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడిచిపోతున్నా.. జిల్లాలో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయి. గత మూడేళ్ల క్రితం ఎదురైన పరిస్థితులే ప్రస్తుతం కనిపిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రారంభంలో మురిపించిన తొలకరి వర్షాలు.. ఆ తర్వాత ముఖం చాటేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అసలే జిల్లాలో నామమాత్రంగా పండే వరి పంట ఈ యేడు కనిపించకుండా పోయే ప్రమాదం ఉందంటున్నారు. అయితే ఇప్పటి వరకు భూగర్భ జలాలు కనీస స్థాయిలో కూడా పెరుగకపోవడం ఆందోళనకర పరిస్థితులకు దారి తీస్తోంది.

ఇలాగైతే కష్టమే!!

ఓ యేడు నష్టం వచ్చినా.. మరో యేడు లాభం రాకపోతుందా?! అనే ధీమాతో వానాకాలం పంటల సాగుకు శ్రీకారం చుట్టిన అన్నదాతలు.. అంతలోనే ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటి వరకు భారీ వర్షాల జాడే లేకపోవడంతో నీటి నిల్వలు కనిష్ఠస్థాయిలోనే కనిపిస్తున్నాయి. ఇలాగైతే వానాకాలం పంటల సాగు ఇక కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భూగర్భ జలాల పెరుగుదల కూడా అంతంతమాత్రంగానే కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆయకట్టు సాగు అనుమానమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే మొలకెత్తిన పత్తి, సోయా, కంది పంటలకు సాగు నీరు అందక వాడు ముఖం పడుతున్నాయి. అదునుదాటి పోతే ఆశించినస్థాయిలో దిగుబడులు వచ్చే అవకాశం లేదంటున్నారు. అలాగే చీడపీడలు ఆశించి పంట దిగుబడుల పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. అప్పు చేసి రూ.లక్షల పెట్టుబడులు పెడుతున్నా.. వాతావరణం అనుకూలించక పోవడంతో నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యధిక వర్షపాతం నమోదయ్యే జిల్లాలో కూడా ఇలాంటి ఆరుగాలం ఏమిటన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మండలాల వారీగా వర్షపాతం వివరాలివీ..

మండలం	సాధారణం	కురిసింది
భీంపూర్	276.1	321.0(మి.మీ.)
జైనథ్	328.7	376.5
బేల	310.1	330.3
గాదిగూడ	306.3	287.5
నార్నూర్	314.8	268.8
ఇంద్రవెల్లి	347.6	314.6
గుడిహత్నూర్	302.5	370.8
ఆదిలాబాద్‌రూరల్	319.6	437.2
ఆదిలాబాద్‌అర్బన్	324.0	459.1
మావల	316.2	292.8
తాంసి	296.8	430.1
తలమడుగు	309.8	345.3
బజార్‌హత్నూర్	318.5	312.8
బోథ్	300.8	276.8
నేరడిగొండ	304.9	338.2
ఇచ్చోడ	315.4	307.1
సిరికొండ	333.6	369.3
ఉట్నూర్	339.1	466.0

సంక్షిప్త సమాచారం



వడూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీలత

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డీపీవో

నేరడిగొండ, జూలై 12: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) శ్రీలత ప్రజలకు సూచించారు. శుక్రవవారం మండలంలోని వడూర్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ అధికారికి సూచించారు. గ్రామంలో మురికి నీరు నిలువ లేకుండా చూడాలన్నారు. నిత్యం గ్రామంలో చెత్తను ట్రాక్టర్ ద్వారా సేకరించి డంపింగ్‌యార్డు తరలించాల న్నారు. దోమల వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, గ్రామపెద్ద గాదె శంకర్ పాల్గొన్నారు.

ఈత చెట్ల పెంపకంపై ప్రత్యేకదృష్టి పెట్టాలి : హిమశ్రీ

తాంసి, జూలై 12: ఈత చెట్ల పెంపకంపై కూడా ప్రత్యేకదృష్టి పెట్టాలని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారిణి హిమశ్రీ అన్నారు. వజ్రోత్సవ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తాంసి మండల కేంద్రంలో ఈతచెట్లు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఈత చెట్ల పెంపకం కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. గౌడ కులస్తులు ఈ విషయంలో దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా స్వచ్ఛమైన ఈతకల్లును అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కల్తీకల్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కూడా మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా ఈత చెట్లను నాటే కార్యక్రమాన్ని కూడా చేపడుతున్నామన్నామని అధికారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాంసిలోని శ్రీనివాస్‌గౌడ్ పొలంలో ఐదు ఎకరాలలో ఈత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్,చ మాజీ ఎంపీటీసీ వన్నెల నరేష్, పలువురు అధికారులు, గౌడ కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

'20న సిడాం శంభు వర్ధంతిని జయప్రదం చేయాలి'

ఉట్నూర్, జూలై 12: ఆదివాసీ హక్కుల నేత, ఆదివాసుల తొలితరం ఉద్యమకారుడు అమరుడు సిడాంశంభు వర్ధంతిని విజయవంతం చేయాలని కోరుతు ఆదివాసీ నాయకులు కరపత్రాలను విడుదల చేశారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్లో మాజీ ఎంపీపీ పంద్రాజైవంతరావు,శంభు తనయుడు సిడాం లచ్చుపటేల్, సిడాం సోనేరావు, సిడాం శేషుల ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించనున్న శంభు వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

పరిసరాల శుభ్రతతో పాటు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా ● 'ఫ్రై డే-డ్రై డే'లో భాగంగా పట్టణంలోని పలు కాలనీల్లో అవగాహన ర్యాలీ ● పాల్గొన్న అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 12: దోమలు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పారిశుధ్య పనులు నిత్యం చేయాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా మహాలక్ష్మివాడ, చిల్కూరిలక్ష్మి నగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ హాజరై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందించారు.ఓ ఇంట్లో కూలర్‌లో నీటి నిల్వ కారణంగా అందులో దోమల లార్వాలు ఉండడాన్ని గమనించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.మురికి కాలువల్లో బ్లీచింగ్, స్ప్రేతో పాటు నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేశారు. కాలనికి వచ్చిన కలెక్టర్ ముందుగా మహాలక్ష్మి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో డీఎంహెచ్ఓ నరేందర్‌రాథోడ్‌తో కలిసి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వల్ల అనేక వ్యాధులు ప్రబలుతాయన్నారు. నీరునిల్వ కారణంగా దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయన్నారు. వాటిని నిరోధించడానికి ప్రజలు పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంతో డ్రైడే నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్‌అహ్మద్, జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్, తదితరులున్నారు.



పట్టణంలోని మహాలక్ష్మి వాడ కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

● 'పనుల పురోగతిని వేగవంతం చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్: అమ్మఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులు, వర్షాలకు రహదారులు కోతకు గురైన వాటి వివరాలు, నిర్మాణ పనులపై శుక్రవారం ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ రాజార్షిషా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనుల తీరును, మండలాల వారీగా పలు పాఠశాలల్లో వివిధ దశల్లో ఉన్న వాటి పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం రహదారుల నిర్మాణాలు, కటాఫ్ రోడ్లపై సమీక్షించి ఆర్అండ్‌బి అధికారి నర్సయ్యను పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు చేపట్టేటప్పుడు ట్రాపిక్‌కు ఇబ్బందులు కలుగ కుండా చూడాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఇందులో ఆర్అండ్‌బి, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మహాలక్ష్మి క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజార్షిషా

● మహాలక్ష్మి క్యాంటీన్‌ను పరిశీలించిన కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో త్వరలో ప్రారంభించనున్న మహాలక్ష్మి క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ రాజార్షిషా శుక్రవారం పరిశీలించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మహిళా క్యాంటీన్‌ను మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయను న్నారు. అనంతరం రిమ్స్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం క్యాంపును సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సదరం క్యాంపుకు వచ్చే దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రిమ్స్ ఔషధాల గదిని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. రికార్డు సక్రమంగా లేకపోవడం, అవసరం మేరకు మందుల సరఫరా ఉండకపోవడానికి ప్రశ్నిస్తూ అసహనం వ్యక్తం చేశారు. రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్, ఆస్పత్రి సూపరింటెండెంట్స్ అశోక్, ఇద్రీస్ అక్బని, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్‌చైర్మన్ అవిశ్వాసంపై కోర్టు స్టే?

ఆదిలాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల18న మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్ రంజానిపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. మరో ఐదు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. దీంతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ముందుకు వెళ్తున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు కౌన్సిలర్లు క్యాంపుబాట పట్టారు. దీంతో అవిశ్వాసం వీగిపోయేలా కాంగ్రెస్ ముమ్మర ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇప్పటికే కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు జంప్ కావడంతో ఇక ప్రయోజనం లేదని భావించిన కాంగ్రెస్ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో అవిశ్వాసం తేదీ లోపే కోర్టు స్టేను తీసుకొచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. దాదాపుగా నేడో రేపో కోర్టు స్టే వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలుస్తుంది. ఇదే జరిగితే బీజేపీ, బీఆర్ఎస్ నేతల ప్లాన్ తలకిందులయ్యే అవకాశం ఉందంటున్నారు. అలాగే కొంత కాలం పాటు వాయిదా వేసే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ అధికార పార్టీ కావడంతో బల్దియాలో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ రేపుతుంది. అయితే ప్రధాన పార్టీలన్నీ ధీమాతోనే కనిపిస్తున్న చివరికి ఏం జరుగుతుందోనన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో కనిపిస్తుంది.

అటవీ ప్రాంతాల్లో అధికారుల పరిశీలన

తాంసి, జూలై 12: మండలంలోని 'రాములగుట్ట సమీపంలో చిరుత హతం' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలో వచ్చిన కథనానికి అటవీశాఖ అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా శుక్రవారం అటవీ శాఖ అధికారులు ఉదయం నుంచి గుట్ట ప్రాంతాల్లో అది చిరుతపులి కళేబర మా? పశువు కళేబరమా? అనే విషయంపై పరిశీలించారు. చెట్టు చెట్టుకు తిరుగుతూ మృతి చెందింది. ఏమిటనే విషయంపై ఆరా తీశారు. చివరకు అది తెల్లపిల్లి కళేబరం అని నిర్ధారించారు. ప్రస్తుతం చిరుతపులి కుచలాపూర్, లింగి అటవీ ప్రాంతాల్లో సంచరిస్తోందని ఫారెస్ట్ ఎఫ్ఎస్‌వో హైమ్మద్ ఖాన్, బీట్ ఆఫీసర్ సాయి కుమార్‌లు పేర్కొన్నారు. చుట్టూ పక్కల ఉన్న గ్రామాల్లో స్థానిక ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నామన్నారు. ప్రస్తుతం చిరుత అటవీ ప్రాంతాల్లో సంచరిస్తోందని, కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని వారు సూచించారు.



రాములగుట్టలో చిరుతపులి జాడలు సేకరిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఎట్టకేలకు గిరిజన సంక్షేమ టీచర్ల బదిలీల ఉత్తర్వులు జారీ

● నేటి నుంచి ఉపాధ్యాయుల జాబితాల ప్రదర్శన



ఉట్నూర్‌లోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల

ఉట్నూర్, జూలై 12: రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీలు ఎట్టకేలకు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు జీవో 17 విడుదల చేశారు. దీనికి అనుగుణంగా ఆయా జిల్లాల గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు బదిలీలు పదోన్నతుల కౌన్సిలింగ్‌ను చేపట్టనున్నారు. ఈ మేరకు ఆదిలాబాద్ జిల్లాలోని 54 గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల బదిలీలకు ఒకే చోట ఐదేళ్ల పూర్తి చేసిన వారు బదిలీ కానున్నారు. జిల్లాలో 25 మంది ప్రధానోపాధ్యాయులు ఐదేళ్ల పూర్తికావడంతో బదిలీ కానున్నారు. వీరి బదిలీలను జోనల్ లెవల్‌లో నిర్వహించనున్నారు.అదే విధంగా 490 గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు 775 మందికి కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. ఒకేచోట పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు 8ఏళ్ల సర్వీసు పరిగణనలోకి తీసుకొని గిరిజన సంక్షేమ అధికారులు సీనియారిటీ జాబితాను సిద్ధం చేస్తున్నారు. 30 జూన్ 2024 వరకు ఒకేచోట పని చేసిన వారిని గుర్తిస్తున్నారు. శనివారం ఆయా జిల్లాల డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయాల్లో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను ప్రదర్శించి, షెడ్యూల్డు వారీగా ఆన్‌లైన్ విధానంలో వెబ్‌కౌన్సిలింగ్‌ను ఆగస్టు 16 వరకు పూర్తి చేసేలా గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఏదిఏమైనా గత కొన్నేళ్లుగా బదిలీలు పదోన్నతులు లేక ఆందోళన చెందుతున్న గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు ప్రభుత్వం జీవో 17 విడుదల చేసి బదిలీల ఉత్తర్వులు జారీ చేయడంతో పలువురు గిరిజన సంక్షేమ శాఖకు చెందిన టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న జేడీఏ పుల్లయ్య

రైతులు కలుపు మొక్కలను తొలగించాలి

● జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

ఇచ్చోడ, జూలై 12: మండలానికి ప్రత్యేకాధికారిగా నియమితులైన జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య శుక్రవారం మండలంలో పర్యటించారు. దీనిలో భాగంగా మండలంలోని ముక్రా(కె) గ్రామాన్ని వీక్షించిన ఆయన పలు కార్యాలయ పనులతో పాటు స్థానిక వ్యవసాయ క్షేత్రాలను కూడా సందర్శించారు. గ్రామ శివారులో పని చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు లేనందున రైతులు కలుపు మొక్కలను తొలగించుకోవాలి. దాదాపు నెలరోజుల పాటు పంటలకు పురుగు మందులు కొట్టాల్సిన అవసరం లేదని రైతులు గమనించాలన్నారు. అలాగే, కొందరూ రైతులు డీఏపీ, యూరియా కలిపి వేస్తున్నారని, అలా వేయకూడదన్నారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న పంటపొలంలో ఉన్న పత్తి, కంది, సోయాబీన్ పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో వన మహోత్సవం, తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం, గ్రామ మాజీ సర్పంచి గాడ్గె మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గె సుభాష్, రైతులు, ఆశ, ఏఎన్ఎమ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తలమడుగు , జూలై 12 : పదవి ఉన్నా.. లేకున్నా ప్రజలతోనే ఉంటానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తాజా మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కజ్జర్ల, చిన్న మందగూడ గ్రామాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత 25 సంవత్సరాల నుంచి నిరంతరం ప్రజలతోనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానన్నారు. ప్రజా సేవ చేసే వారికి పదవులు శాశ్వతం కావన్నారు. అనంతరం మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్, వైస్ ఎంపీపీ దివ్య మాధవ్, కజ్జర్ల ఎంపీటీసీ గోదావరి కమలాకర్, సుంకిడి వెంకన్న యాదవ్‌లను శాలువాలతో గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాబన్న, మాజీ సర్పంచ్‌లు విఠల్, గణేష్, పోశెట్టి, శ్రీను, కృష్ణారెడ్డి, జై భారత్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, స్వామిరెడ్డి, రఘువ రన్ రెడ్డి, ప్రాపుల్‌రెడ్డి, పూర్ణ చంద్, టి.తిరుపతి, సంతోష్, చిన్న భూమ న్న, జీవన్, దేవురావు, వినాయక్, శ్రీనివాస్ పటేల్, రావుల నారాయణ, రాకేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులతో ప్రయాణికులకు ఇక్కట్లు

● వర్షాలతో బురదమయం


రోడ్డుపై క్యూ లైన్లో వేచి ఉన్న వాహనదారులు

ఇచ్చోడ, జూలై 12: ఇచ్చోడ మండల కేంద్రంలో నూతనంగా విస్తరిస్తున్న రహదారి పనులు కొనసాగుతుండడంతో ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. రహదారి పనుల్లో భాగంగా ఓవైపు రహదారి నిర్మాణ పనులు సాగుతుండడంతో.. వాహనాలు ఒకవైపు నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఎదురుగా ఏదైనా వాహనం వస్తే అటువైపు వెళ్లే వాహనాలు కాసేపు అలాగే నిలపాల్సి వస్తోంది. రహదారి ఇరుకుగా ఉండడంతో ఆపై వానకాలం మొదలవడంతో ప్రయాణికులు కొంత ఇబ్బందులకు గురవుతున్నారు. సెంట్రల్ లైటింగ్, డివైడర్‌తో కూడిన రహదారి నిర్మాణం త్వరగా పూర్తవుతే బాగుంటుందని వాహనదారులు, ప్రయాణికులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటా మొక్కలు నాటండి

భోథ్, జూలై 12 : మండలంలోని కనుగుట్టలో శుక్రవారం ఇంటింటా మొక్కలను గ్రామ కార్యదర్శి గంగయ్య పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పంపిణీ చేసిన మొక్కలను వృథా చేయ వద్దని గ్రామస్తులకు వివరించారు. ప్రతిఇంటి వద్ద ఖాళీ స్థలాల్లో మొక్క లను నాటినట్లయితే వేసవి కాలం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. భవిష్యత్తులో ఉపయోగపడే మొక్కలను వృథా చేయవద్దన్నారు.

వంతెనపై గుంత పూడ్చి వేయండి

భోథ్ , జూలై 12 : మండల కేంద్రం సమీపంలోని పెద్దవాగుపై నిర్మించిన బ్రిడ్జిపై గుంత పడింది. ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు గుంత మూసివేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం వినతి

నిర్మల్ కల్చరల్, జూలై 12: రాష్ట్రంలో ఫీజు రియంబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డీఆర్‌వోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దిగంబర్ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించడం లేదన్నారు. రూ.కోట్ల బకాయిలు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. యాజమాన్యాలు ఫీజులు చెల్లించలేదన్న నెపంతో సర్టిఫికెట్లు జారీచేయడం లేదని ఆరోపించారు. బకాయిలు రాకపోవడంతో కళాశాలలు మూతపడే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. రమేష్, అరవింద్, మోహన్, రవి, సోమేష్, రాహుల్, కార్తీక్, తదితర నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి ఘటన హేయమైన చర్య

● ఖానాపూర్‌లో విధులను బహిష్కరించి న్యాయవాదుల నిరసన

ఖానాపూర్, జూలై12: సిద్దిపేటలో న్యాయ వాది రవికుమార్‌పై జరిగిన దాడి అత్యంత హేయమైన చర్యని ఖానాపూర్ బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు మంత్రరాజం సురేష్ అన్నారు. ఆ దాడిని నిరసిస్తూ శుక్రవారం ఖానాపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరించి న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే న్యాయవాద రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై దాడి చేయడం సరైనది కాదన్నారు. ఇటువంటి దాడులకు తెగబడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఖానాపూర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నేరెళ్ల సత్యనారాయణ, బక్కశెట్టి కిషోర్, వెంట మహేంద్ర, కిషోర్‌నాయక్, కమలాకర్, రాజలింగం, షేక్ అంజర్, శివ కుమార్, తదితరులు ఉన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో మున్సిపల్ చైర్మన్ పూజలు

ఖానాపూర్, జూలై12: మండలకేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలోని మహాలక్ష్మి ఆలయంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి పండగను పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు నాయిని సంతోష్, కాంగ్రెస్ జిల్లా నాయకులు జన్నారపు శంకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గొర్రె గంగాధర్, పరిమి సురేష్, నాయకులు డబ్బా శ్రీనివాస్, ఏ. జనార్ధన్, ధ్యావతి రాజేశ్వర్, తదితరులున్నారు.

చెరువులో ఒకరి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటకు తీస్తున్న జాలర్లు

నర్సాపూర్(జి), జూలై12: మండలంలోని కుస్లి గ్రామంలో శుక్రవారం జాలర్లు ఎల్లమ్మ చెరువు నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుస్లి గ్రామానికి చెందిన మర్రి ఆశన్న (52) గురువారం సాయంత్రం నుంచి ఇంటికి రాకపోవడంతో భార్య మర్రి లక్ష్మి తన భర్త ఆచూకీ కోసం పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. కుస్లి గ్రామానికి చెందిన బాలుడు సోను ఎల్లమ్మచెరువు వద్ద సిగరెట్ ప్యాకెట్, చెప్పులు, టవల్, లుంగీ, లైటర్ గట్టున ఉండటాన్ని గమనించి స్థానికులకు సమాచారం అందించాడు. సమాచారాన్ని పోలీసులకు అందించారు. స్థానికుల సహాయంతో ఎస్సై మునిగెల హన్మాండ్లు సంఘటన స్థలానికి చేరుకొని ఎల్లమ్మ చెరువులో గజ ఈతగాళ్ళతో గాలింపు చర్యలు చేపట్టగా మర్రి ఆశన్న శవం లబ్యం కావడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రైవేట్ వాహనాల

పార్కింగ్‌కు అడ్డాగా ఏరియా ఆసుపత్రి!

● నిత్యం 200పైగా వాహనాల పార్కింగ్ ● స్థలం లేక బయటే అంబులెన్స్ ● అంబులెన్స్‌లో వచ్చిన రోగులు స్ట్రెచర్‌పై లోనికి..



ఏరియా ఆసుపత్రి అవరణలో నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలు

భైంసా, జూలై12: భైంసాలోని ఏరియా ఆసుపత్రి ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. ఆసుపత్రి అవరణతో పాటు అవుట్ పేషెంట్ విభాగం వెళ్లే మార్గం, మార్చురీ గది ప్రాంతం పార్కింగ్ చేసిన ప్రైవేట్ వాహనాలతో నిండుకుంటోంది. భైంసా నుంచి వివిధ ప్రాంతాలకు నిత్యం రాకపోకలు చేపట్టే వారందరూ ఇంటి నుంచి బస్టాండ్ వరకు తమ ద్విచక్ర వాహనాలతోవచ్చి వాటిని ఇక్కడి ఏరియా ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. సాయంత్రం వేళలో తిరిగి వచ్చి పార్కింగ్ చేసిన తమ ద్విచక్ర వాహనాలను తీసుకొని ఇంటికి పయనమవుతున్నారు. ఇలా నిత్యం 200 పైగానే ప్రైవేట్ వాహనాలు ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్‌చేసి ఉంటున్నాయి. దీంతో చికిత్సల కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు పాట్లు పడాల్సి వస్తోంది. ప్రైవేట్ వాహనాల నిలిపి ఉంటుండటంతో 108,102 అంబులెన్స్‌ల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఒక్కో పర్యాయం అంబులెన్స్‌లు బయటనే నిలిపి ఉంచాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌తో అంబులెన్స్‌లు లోనికి రావడానికి వీలులేక బయటనే నిలిపివేయాల్సి వస్తోంది. వాటిల్లో తీసుకవచ్చిన బాధితులను బయటి నుంచి స్ట్రేచర్‌పై ఆసుపత్రి లోనికి తీసుకరావాల్సి వస్తోంది. ఇక ప్రసవించిన బాలింతరాళ్లను ఇంటికి తరలించే 102 అంబులెన్స్‌లు సైతం బయట నుంచే సేవలు అందివ్వాల్సి వస్తోంది. డిశ్చార్జీ సమయంలో బాలింతరాళ్ల ఆసుపత్రిలోని ప్రసూతి వార్డు నుంచి పసికందులతో అవస్థలు పడుతూ ఆసుపత్రి బయట వరకు నడుచుకుంటూ వచ్చి 102 అంబులెన్స్ ఎక్కాల్సిన పరిస్థితులున్నాయి. ఆరోగ్య పరీక్షలు, ప్రసవం కోసం ఆటోలలో వచ్చే గర్భిణీలు సైతం ఆసుపత్రి బయట వరకు ఆటోలో వచ్చి అక్కడి నుంచి లోపలికి నడుచుకుంటూ రావాల్సి వస్తోంది. ఆసుపత్రి నిర్వాహణాధికారులు ఇకనైనా స్పందించి ప్రైవేట్ వాహనాలు నిలుపకుండా పకడ్బందీ చర్యలు చేపట్టి ఇక్కట్లను తొలగించాలని రోగులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

మారణాయుధాలతో రీల్స్ చేస్తున్న ముగ్గురి అరెస్టు

● తుపాకీ, బైక్, మూడు సెల్‌ఫోన్ల స్వాధీనం ● సోషల్ మీడియాపై 24గంటల నిఘా పెట్టేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు

● సమాజంలో అలజడి సృష్టించే పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు: నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల



స్వాధీనం చేసుకున్న రివాల్వర్, సెల్‌ఫోన్లు



వివరాలను వెల్లడిస్తున్న నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ టౌన్, జూలై 12: జిల్లాకేంద్రంలో నకిలీ రివాల్వర్‌తో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ముగ్గురు యువకులను నిర్మల్ పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ జానకి షర్మిల వివరాలను వెల్లడించారు. నిర్మల్ పట్టణానికి చెందిన ఆవేజ్‌చావుస్, షేక్ మతినుద్దీన్, షేక్ ఆదిల్ ముగ్గురు యువకులు స్నేహితులు ఇన్‌స్టాగ్రామ్ వేదికను చేసుకొని మతిన్ మాఫియా పేజీని క్రియేట్ చేసుకున్నారు. షేక్ మతినుద్దీన్ గతంలో మొబైల్ దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్నాడు. షేక్ ఆదిల్ హైదరాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తి వద్ద తుపాకీని కొనుగోలు చేశాడు. ఈ ముగ్గురూ జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించేందుకు ఓ ముఠాగా ఏర్పడి జనసంచారం లేని ప్రదేశాలలో ఏకాంతంగా ఉండే జంటలను, రాత్రివేళల్లో ఒంటరిగా వెళ్తున్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని రీల్స్ చేస్తున్నామంటూ నకిలీ తుపాకీతో బెదిరించి ఒంటరిగా నిద్రిస్తున్న వ్యక్తులను, రాత్రివేళల్లో బస్టాండ్‌లలో తలదాచుకున్నటువంటి వారి నుంచి అందిన కాడికి దోచుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం నిర్మల్ పట్టణంలోని మంచిర్యాల చౌరస్తా వద్ద ఎస్సై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వస్తూ పోలీసులను చూసి పారిపోయారు. వీరిపై అనుమానం రావడంతో వెంటనే వెంబడించిన పోలీసులు శ్యామ్‌గడ్ వద్ద ఆవేజ్ చావుస్, షేక్ మతినుద్దీన్ వారి మిత్రుడు షేక్ అదిల్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటికొచ్చిందని పోలీసులు తెలిపారు. వీరివద్ద నుంచి నకిలీ తుపాకీ, ఏపీ 01 ఏహెచ్ 1444 ద్విచక్ర వాహనం, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో సోషల్ మీడియాపై 24 గంటల నిఘా ఉంచడానికి ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయడం, సమాజంలో అలజడి సృష్టించేలా ఎటువంటి పోస్టులు పెట్టిన వాటిని వేరే వారికి షేర్‌చేసిన వారిపైన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. సమావేశంలో డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ సీఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ జైకిష్టు, కానిస్టేబుల్ గణేష్, విజయ్, వర్మలు ఉన్నారు.



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను చూపుతున్న లబ్ధిదారులు

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

● త్వరలోనే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.లక్షతోపాటు తులం బంగారం

● వన మహోత్సవంలో అందరూ మొక్కలు నాటాలి: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్, జూలై12: నిరుపేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. శుక్రవారం ఖానాపూర్‌లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సమావేశం మందిరంలో నిర్వహించి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. త్వరలోనే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ. లక్షతోపాటు తమ ప్రభుత్వం తులం బంగారాన్ని సైతం అందజేయనుందన్నారు. ఖానాపూర్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే సదర్మాట్‌పై ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ వహిస్తోందన్నారు. సదర్మాట్ కెనాల్ అభివృద్ధి కోసం ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తామన్నారు. గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో నిర్వహించిన 75 వన మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేడియం ఆవరణలో మొక్కలు నాటారు. వనమహోత్సవంలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈవేర్వేరు కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, మండల అధ్యక్షుడు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, పీఏసీఎస్ చైర్మన్లు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ఆమంద శ్రీను, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంకం రాజేందర్, పరిమి సురేష్, అమానుల్లా ఖాన్, షబ్బీర్ పాషా, వెంకాగౌడ్, నాయకులు సలీం ఖాన్, తోట సత్యం, యూసుఫ్ ఖాన్, పుప్పాల శంకర్, గొర్రె గంగాధర్, నేరెళ్ల సత్యనారాయణ, కట్ట శ్రీనివాస్, తూము చరణ్, రాజేందర్, మ్యాదరి రాజేశ్వర్, శేషాద్రి, ఎల్. రమేష్, జూని, జహీర్, మజీద్, లక్ష్మీపతి, షౌకత్ పాషా, జంగిలి శంకర్, రాజు, బొడ్డు గంగన్న, మీర్జా, నహీం, రామచందర్, నిట్ట రవి, రమేష్, ముషీర్, జహీర్, మున్సిపల్ అధికారులు, మెప్మా, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులున్నారు.

మొక్కలు పెరిగేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలి

● అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

సారంగాపూర్, జూలై 12 : నాటిన మొక్కలు పెరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలో గల మైనార్టీ గురుకుల పాఠశాల ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా ఉపాధిహామీ సిబ్బందితోపాటు విద్యార్థులు మొక్కలను నాటి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటిన మొక్కలకు ప్రతీరోజు నీరును అందిస్తూ మొక్కలుఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్ రెడ్డి, ఎంపీడీవో లక్ష్మీ కాంతారావు, ఎంపీవో తిరుపతి రెడ్డి, ఉపాధి సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.



గురుకుల పాఠశాలలో మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్



చర్లపల్లిలో సవారిషెడ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్

మత సామరస్యానికి ప్రతీక మొహరం

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, జూలై 12: మత సామరస్యానికి ప్రతీకగా మొహరం పండుగ అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చర్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సవారి బంగ్లా షెడ్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పండుగలు అనేవి ప్రజల్లో సోదర భావాన్ని పెంపొందించి సమాజంలో శాంతి తీసుకుని రావాలని కోరారు. అనంతరం అడిగిన వెంటనే షెడ్‌కు నిధులను మంజూరు చేయించి నిర్మాణం చేపట్టిన ఎమ్మెల్యేను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఇందులో మండల కన్వీనర్ తోట వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ ఎల్మా శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కేదారేశ్వర్‌రెడ్డి, యువ నాయకులు అభిరాంరెడ్డి, జనాక్ పటేల్, అబ్దుల్లా, రమాకాంత్, ప్రమోద్, గంగాధర్, సుదర్శన్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రాంబాయి, పల్లవి, లక్ష్మణ్, నర్సింలు, రాంరెడ్డి, నారాయణరెడ్డి, ప్రీతంరెడ్డి, కృష్ణారెడ్డి, తిరుమల్‌గౌడ్, పాండురంగ్, తదితరులు పాల్గొన్నారు.

జోగు రామన్న, పాయల శంకర్ ఇద్దరూ ఒక్కటే : డీసీసీబీ చైర్మన్

ఆదిలాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ ఇద్దరూ ఒక్కటేనని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జహీర్‌రంజానిపై అవిశ్వాస తీర్మానం విషయంలో బీఆర్ఎస్, బీజేపీ దోస్తి కుదిరిందన్నారు. పైపైకి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్న అంతర్గతంగా మాత్రం ఈ ఇద్దరు నేతలు ఒకటేనని తేలిపోయిందన్నారు. ఇదంతా జిల్లా ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ బీఆర్ఎస్‌తో కుమ్మక్కైనట్లు సొంత పార్టీ నేతలే ఆరోపించారని గుర్తు చేశారు. జోగు రామన్న కుమారుడికి మున్సిపల్ చైర్మన్ పదవి దక్కే విధంగా పాయల శంకర్ సహకరించిన విషయం అందరికీ తెలుసన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌ను గద్దె దించేందుకు ఈ ఇద్దరు నేతలు ఆడుతున్న ఆటలు ఇక సాగవన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు కలిసి క్యాంపునకు వెళ్లడం జరిగిందన్నారు. జిల్లాకేంద్రంలోని అసైన్డ్ భూముల వ్యవహారాల్లోను వీరి హస్తం ఉందన్నారు. ఇందులో ఆశమ్మ, మునిగెల నర్సింగ్, కలాల శ్రీనివాస్, బండారి సతీష్, లక్ష్మణ్, జాఫర్, గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్ రెడ్డి, కొర్రెడ్డి కిషన్, శకిల్, ఖయ్యుం, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

మానవ మనుగడకు చెట్లే జీవనాధారం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ● గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకుల కళాశాలలో వన మహోత్సవం



ఉట్నూర్ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, జూలై 12: మానవ మనుగడకు చెట్లే జీవనాధారమని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమశాఖ బాలికల గురుకుల కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమంలో బాగంగా అధికారులు, విద్యార్థులు, మండల నాయకులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెట్లతోనే మానవ జీవనం ముడిపడి ఉందని, ప్రతి ఒక్కరు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు వన మహోత్సవ కార్యక్ర మానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రపంచంలో వాయు కాలుష్యం, జల కాలుష్యం, భూకాలుస్యం జరగడానికి మనిషే కారణమని, తన సొంత స్వలాభం కోసం చెట్లు నరికి వేస్తున్నాడని అన్నారు. కావున యథేచ్ఛగా చెట్లను నరకకూడదని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు జరుగకుండా ఉండాలంటే ప్రతీ ఒక్కరు మొక్కలను నాటాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఎం.శర్మ, ఈజీఎస్ ఏపీవో రజనికాంత్, ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ ఇక్బాల్, లాజర్, అన్సారి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత



పాల్గొన్న వ్యాయామ ఉపాధ్యాయులు

పకడ్బందీగా పాఠశాల క్రీడా పోటీలు : డీఈవో

ఆదిలాబాద్ రూరల్, జూలై 12: ఈ విద్యా సంవత్సరం 2024-25లో పాఠశాల క్రీడా పోటీలను కడ్బందీగా నిర్వహిస్తామని డీఈవో టి.ప్రణిత స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాకాల సూచి ఏర్పాటు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సారి మరిన్ని రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించేందుకు నిర్వాహకుల నుంచి ప్రతిపాదనలను ఈ నెల 20 లోపు స్వీకరిస్తామని పేర్కొన్నారు. త్వరలోన క్రీడ కాల సూచిని విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కాంతారావు, పేట సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పార్థసారథి, స్వామి, సీనియర్ పీడీ దయానంద్‌రెడ్డి, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మంచిర్యాల నుంచి ఆదిలాబాద్‌కు బస్సులను పెంచాలి'

ఉట్నూర్, జూలై 12: మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి ఉట్నూర్ మీదుగా ఆదిలాబాద్‌కు ప్రతిరోజు రాత్రి 8గంటలకు బస్సు నడపాలని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఉట్నూర్ డిపో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఉట్నూర్ నుంచి ఇతర ప్రాంతాలకు బస్సులు పెంచాలని కోరుతున్న ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఉట్నూర్ బస్ డిపోలో బస్‌లను చాలా వరకు తగ్గించారని, ఇలా తగ్గించడం వల్ల ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మంచిర్యాల నుంచి ఆదిలాబాద్‌కు ఆకరి బస్సు సాయంత్రం 6గంటలకు ఉండడంతో దాని తర్వాత బస్సు సౌకర్యం లేకపోవడంతో మంచిర్యాల నుంచి దండెపల్లి, జన్నారం, ఉట్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఆదిలాబాద్ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు లక్షెటిపేట వరకు వచ్చి ఆగి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, మంచిర్యాల నుంచి ఆదిలాబాద్‌కు సాయంత్రం అదనంగా 6.30, 7, 8గంటల వరకు మూడు బస్సులు పెంచి ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలని కోరారు. ఇందులో భాగంగా ఉట్నూర్ నుంచి నిర్మల్‌కు ఒక్క బస్సు కూడా నడపకపోవడం దురదృష్టకరం అన్నారు. ఇందుకు ఉట్నూర్ నుంచి వయ కడం, ఖానాపూర్, మామడ, నిర్మల్ వెళ్లే ప్రయాణికులకు చాలా ఇబ్బందికి గురవుతున్నారని, గుడిహత్నూర్ మీదుగా వెళ్లే ప్రయాణికులు సైతం గుడిహత్నూర్‌లో దిగి పిల్ల పాపలు, ముల్లె మూటలతో బస్సులు ఎక్కి దిగాల్సిన పరిస్థితి ఎదురవుతుందని, ప్రయాణికులను కష్టాల నుంచి కాపడడానికి ఆర్టీసీ ఉన్నతాధికారులు బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. అదేవిధంగా ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని బస్సులు నడపాల్సిన అవసరం ఎంతైనా ఉందని, లేని యెడల ఆందోళన చేపడతామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు మహమ్మద్ ముజీబ్, సాజిద్ సిద్దిఖీ, తదితరులున్నారు.

ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్‌పై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, జూలై 12: ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులు అనిల్ గోస్వామి, జాట్ వీరి ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని కళాశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిక్రూట్‌మెంట్ కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఈనెల 28 వరకు ఉందని తెలిపారు. ఆ తదుపరి అక్టోబర్ 18న రిటన్ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీపీఆర్‌వో తిరుమల పాల్గొన్నారు.

'పరిసరాల శుభ్రతతో దోమల నివారణ'

ఇచ్చోడ, జూలై 12: రోగాల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవాలని, వారానికి ఒక్కసారి మన ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ సూచించారు. శుక్రవారం ఇచ్చోడ మండలంలోని కామగిరి గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా వర్షం నీరు నిల్వ ఉండే కుండీలు, పాతటైర్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాలతో పలు గ్రామాల్లో, పాఠశాలల్లో విద్యార్థులకు దోమల ద్వారా రోగాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంపై అవగాహన కల్పించడం జరిగిందని వారు ఈ సందరర్భంగా పేర్కొన్నారు. అలాగే మన ఇంటి పరిసరాలతో పాటు మన చుట్టూ ఉన్న వాళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోలని సూచించారు.

'ఇంటింటా మొక్కలు నాటాలి'


నేరడిగొండ, జూలై 12: గ్రామాల్లో ఇంటింటికి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మండల ప్రత్యేకాధికారి రవీందర్ గ్రామస్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కుమారి గ్రామంలో ఇంటింటికి ఆరు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల కోసం మనం మొక్కలు నాటి వాటి ఫలాలను వారికి అందించాలన్నారు. చెట్లతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందన్నారు.అందుకే మొక్కల పెంపకాన్ని ప్రతీఒక్కరు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రజ్వీర్, ఎంపీవో లక్ష్మణ్, ఏపీవో వసంత్‌రావు, పంచాయతీ కార్యదర్శి టీప వినోద్, ఎఫ్ఏ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

'రోడ్లపై పశువులను కట్టడి చేయాలి'

బోథ్, జూలై 12: మండల కేంద్రంలో రోడ్లపై తిరిగే పశువుల వల్ల ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. గ్రామంలోని అనేక మంది రైతులు పశువులను కాపలా పెట్టించకుండా విడిచిపెట్టడంతో ప్రతిరోజు రాత్రీ, పగలు పశువులు సంచరిస్తున్నాయని ఫలితంగా తమ చేలపై పాడి పంటలను నాశనం చేస్తుండటంతో నష్టపోవాల్సి వస్తుందని పలువురు రైతులు వాపోతున్నారు. గ్రామంలో తిరిగే పశువులను గ్రామ పంచాయితీ వారు కాని గ్రామ అభివృద్ధి కమిటీ వారు గాని కట్టడి చేసి రైతులకు నష్టం జరగకుండా చూడాలని కోరుకుంటున్నారు. లేకుంటే గ్రామంలో తిరిగే పశువులను గోశాలలకు పంపించాలని వారు కోరుతున్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి : సీపీవో

తాంసి, జూలై 12: కస్తూర్బా పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సీపీవో వెంకటరమణ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం తాంసి కస్తూర్బా పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. దీనిలో భాగంగా మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారో లేదో విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీవో మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. ప్రతీ బాలిక తమవంతుగా మూడు మొక్కలను నాటి వాటిని పెంచి పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సౌజన్య, తదితరులు ఉన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8, కనిష్ఠం 25.6

నిర్మల్ జిల్లా వార్తలు
6
శనివారం 13 జూలై 2024

బాధిత కుటుంబానికి పరామర్శ

బాసర, జూలై 12 : అనారోగ్యంతో ఇటీవలే మృతిచెందిన బాసర మాజీ ఎంపీటీసీ సభ్యురాలు భూదేవి కుటుంబ సభ్యులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శించారు. ఆమె తనయుడు డిష్ పోతన్నకు ఓదార్చి ధైర్యాన్ని అందించారు. ప్రభుత్వపరంగా అన్నివిధాలుగా ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయనవెంట బాసర మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేష్ గౌడ్, స్థానిక నాయకులు మల్కన్న, జ్ఞాని, మల్లయ్య, గంధం మల్కన్న ఉన్నారు.

ఆయిల్‌పామ్ పనులకు అడ్డంకులు!

- నేటికీ జారీ కాని పొల్యూషన్ క్లియరెన్స్ సర్టిఫికెట్
- అంతుపట్టని కారణాలు
- 40 ఎకరాల స్థలాన్ని కేటాయించిన అప్పటి ప్రభుత్వం
- ఫ్యాక్టరీ ఏర్పాటుకు ముందుకు వచ్చిన మలేషియా కంపెనీ
- అయోమయంలో పంట సాగు చేస్తున్నరైతులు


• పాక్‌పట్ల గ్రామ శివారులో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మించ తలపెట్టిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పొల్యూషన్ బోర్డు సభ్యులు (ఫైల్)

నిర్మల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సోన్ మండలం పాక్‌పట్ల వద్ద నిర్మించతలపెట్టిన ఆయిల్‌పామ్ పాఫ్యాక్టరీ నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. జిల్లాలో ఆయిల్‌పాం సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తూ దానికి సంబంధించిన పరిశ్రమను సైతం ఇక్కడే స్థాపించేందుకు ఉద్యానవన శాఖ నిర్ణయించింది. దీనికి అనుగుణంగా మలేషియాకు చెందిన ప్రీయూనిక్ ప్రైవేటు ఇండియా లిమిటెడ్ అనే కంపెనీ ఈ ఆయిల్ పామ్ పరిశ్రమను ఏర్పాటు చేయతలపెట్టింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభు త్వం ఆయిల్‌పామ్ సాగు, పరిశ్రమల ఏర్పాటుకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన నేపథ్యంలో ఇక్కడి అధికారులు 40ఎకరాల భూమిని సైతం ఏర్పాటు చేశారు. పరిశ్రమ ఏర్పాటు కాబోతున్నందన ధీమాతో రైతులు గత 2022-2023 సంవత్సరంలో 3567 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగుచేశారు. దీంతోపాటు సారంగాపూర్ మండలంలోని బీరవె ల్లివద్ద ఆయిల్‌పామ్ నర్సరీని కూడా ఏర్పాటుచేశారు. అయితే ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి అన్నిరకాల అనుమతులు సమకూరినప్పటికీ పొల్యూషన్ క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇప్పటివరకు జారీకాకపోవడంతో ఈపరిశ్రమ పనులను మొదలుపెట్ట లేకపోతున్నారని చెప్పున్నారు. అయితే పొల్యూషన్ సర్టిఫికెట్ జారీకాకపోడానికి అసలు కారణం వేరేఉందని అంటున్నారు. కొంతమంది నిజామాబాద్ కు చెందిన ప్రజాప్రతినిధులు ఈ పరిశ్రమను అక్కడి నవీపేట్ మండల కేంద్రానికి తరలించుపోవాలని ప్రయత్నిస్తున్న కారణంగానే ఆటంకాలు ఏ ర్పడుతున్నాయని అంటున్నారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 11వేల ఎకరా ల్లో ఈ పంటను రైతులు దశలవారిగా సాగుచేస్తున్నారు. అయితే మరో ఏడాది తర్వాత ఆయిల్‌పామ్ పంట చేతికి రానున్నందున ఈ పంటను ఎక్కడ విక్రయించుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడబోతోం దని అంటు న్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలో అశ్వరావ్ పేట్‌లో మాత్రమే ఆయిల్‌పామ్ పరిశ్రమ ఉన్న కారణంగా ఇప్పటివరకు ఇక్కడి రైతులు ఈ పంటను సాగు చేసేందుకు వెనకంజ వేశారు. జిల్లాలో పరిశ్రమ ఏర్పడబోతుందన్న కారణంగా రైతులు ప్రస్తుతం ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిశ్రమకు అనుమతులు రాని కారణంగా సాగు చేస్తున్న రైతలంతా ఆందోళనకు గురవుతున్నారు.



• సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామ సూచిక బోర్డు

జిల్లాలో పెద్దఎత్తున పంట సాగు..

జిల్లాలో 2022-2023 సంవత్సరం నుంచి ఆయిల్‌పాం పంట సాగుపై వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులతోపాటు అప్పటి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం కల్పించారు. ఆయిల్‌పామ్ పంటతో చే కూరే ప్రయోజనాలను వివరించడమే కాకుండా పంట సాగుచేసే రైతులకు ప్రోత్సాహకాలను ప్రచా రం చేయడంతోరైతులు ఇటువైపు మొగ్గుచూపారు. 2022-2023లో మొత్తం 1322 మంది రైతులు 3567 ఎకరాల్లో ఈపంటను సాగుచేయగా 2023-2024లో 1538మంది రైతులు 3496 ఎకరాల్లో పంటను సాగుచేశా రు. ఈ ఏడాది 2024-2025లో 3500 ఎకరాల్లో పంటను సాగుచేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 2500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కల ను నాటారు. అయితే మొదట్లో పంటను సాగుచేసిన రైతులు దిగుబడి పై ఆశలు పెట్టుకొని ఆ పంటను ఎలా విక్రయించుకోవాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు.


• జిల్లాలో సాగవుతున్న ఆయిల్‌పామ్ పంటలు

భారీగా రాయితీలు

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ఉద్యానవనశాఖ ద్వారా పెద్ద ఎత్తున రాయితీలను కల్పిస్తున్నారు. రైతులకు సబ్సిడీపై డ్రిప్ సౌకర్యాన్ని కూడా అందించేందుకు ఏర్పాట్లుచేశారు. ఎస్సీఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీ ఇవ్వగా బీసీ ఇతర కులాల చిన్నతరహా రైతులకు 90 శాతం సబ్సిడిని అందిస్తున్నారు. అలాగే పెద్దరైతులకు 80 శాతం సబ్సిడీపై డ్రిప్ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. దీంతోపాటు పరిశ్రమను స్థాపిస్తున్న యాజమాన్యం ఆ పరిశ్రమ నిర్మాణం పూర్తికాకపోతే పంటను తామే కొనుగోలు చేసి ఆశ్వరావుపేటకు తరలిస్తామంటూ కూడా ప్రకటించింది. దీంతోపాటు అంతర పంటలకు కూడా అవసరమైన సబ్సిడీలు, రాయితీలను అందించేందుకు ఏర్పాట్లుచేశారు. సాగు కోసం అవసరమయ్యే మొక్కలను రైతులకు సబ్సిడీపై అందిస్తున్నారు.

పొల్యూషన్ క్లియరెన్స్ జాప్యంపై అనుమానాలు

సోన్ మండలం పాక్‌పట్ల వద్ద ప్రీయూనిక్ కంపెనీ సాంకేతిక పరంగా క్షేత్రస్థాయిలో అన్నిరకాల అనుకూలతలను పరిశీలించి ఆ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. అలాగే ప్రభుత్వం సైతం 40 ఎకరాల స్థలాన్ని ఈ పరిశ్రమ కోసం కేటాయించింది. అయితే అన్నిరకాల అనుమతులు జారీ అయినా పొల్యూషన్ బోర్డు నుంచి మాత్రం పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు రాకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి పరీవాహక ప్రాంతంలో ఈ పరిశ్రమ ఉండడమే కాకుండా చుట్టూ పంట పొలాలు ఉన్న కారణంగా అనుమతులు జారీ కావడం లేదని అంటున్నారు. అయితే కొంతమంది నిజామాబాద్‌కు చెందిన ప్రజాప్ర తినిధుల ఒత్తిళ్లమేరకే పరిశ్రమకు సంబంధించి పొల్యూషన్ బోర్డు నుంచి అనుమతులు జారీ కావడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిశ్రమను నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు తరలించాలన్న ప్రయత్నాల్లో భాగంగానే అనుమతులు రావడంలేదని అంటున్నారు. ఇప్పటికే పలుసార్లు పొల్యూషన్‌బోర్డుసభ్యులు ఈ పరిశ్రమ నిర్మాణ ప్రాంతంతోపాటు పరిసరాలను అలాగే అనుమతుల జారీకి ఎదురవుతున్న అవరోధాలపై విచారణ జరిపారు. పరిశ్రమ నిర్మాణాన్ని చేపట్టి అయోమయాన్ని తొలగించాలని రైతులు కోరుతున్నారు.




• సాగవుతున్న ఆయిల్‌పామ్ పంట


డ్రై డేలో పాల్గొన్న చైర్మన్ ఈశ్వర్

'శుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవు'

నిర్మల్‌కల్చరల్, జూలై12: ప్రజలు వర్షాకాలంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి సీజనల్ వ్యాధులు దరిచేరవని చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శుక్రవారం వార్డు నెంబర్ 33లో పర్యటించారు. నాళాల వెంట పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, నీటికాలువలు పరిశీలించారు. డ్రైడేలో భాగంగా పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. దోమలు వ్యాప్తికాకుండా మురుగు కాలువల్లో ఆయిల్స్ బాల్స్ వేయించారు. పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని, వాడిన టీ కప్పులు ఎప్పటికప్పుడు తొలగించాలని కోరారు. ఇళ్లలో వాడే కూలర్లలో, ఫ్రీజ్, ఏసీల్లో నీరునిల్వకుండా శుభ్రపర్చుకోవాలన్నారు. అనారోగ్యానికి గురైతే ఆసుపత్రులకు వెళ్లి వైద్య చికిత్సలు చేయించుకోవాలని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, జవాన్ శేఖర్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కట్నం కేసులో ఇద్దరికి జైలు

సారంగాపూర్, జూలై 12: అదనపు కట్నం కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా సెషన్ కోర్టు న్యాయాధికారి కరుణ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. మండలంలోని ధని గ్రామానికి చెందిన సౌమ్యను అదనపుకట్నం కోసం భర్త, మామలు వేధింపులకు గురిచేయడంతో సౌమ్య మృతిచెందింది. వేధింపులకు గురిచేసిన వ్యక్తులపై మృతిరాలి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. నేరం రుజువైనందున జిల్లా సెషన్ కోర్టు న్యాయాధికారి కరుణ కుమార్ నేరస్తులకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.6 వేల జరిమానా విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఐఐటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

నిర్మల్ టౌన్, జూలై 12: నిర్మల్ పట్టణంలోని వాసవి ఒలంపియాడ్ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభను కనబరిచి సీట్లను సాధించారు. శుక్రవారం ఐఐటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్యాట్రాన్ లింగారెడ్డి, కరస్పాండెంట్ పోతారెడ్డి, సెక్రటరీ జగదీశ్వర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ శెట్టిలు విద్యార్థులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన బీజేపీ జిల్లా నేతలు

నిర్మల్ కల్చరల్, జూలై 12: నిర్మల్ జిల్లా బీజేపీ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మేడిసెమ్మెరాజు, రాజేశ్వర్‌రెడ్డి, గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి పాండే, నారాయణ రెడ్డి, గోపాల్, సాయినాథ్ పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన జిల్లా నాయకులు

జిల్లాలో మొక్కలు నాటే లక్ష్యం సాధిస్తాం

• కలెక్టర్ అభిలాష అభినవ్


మొక్క నాటుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ కల్చరల్, జూలై12: జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన మేరకు మొక్కలు నాటి లక్ష్యాన్ని సాధిస్తామని కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. శుక్రవారం సోన్ మండలం సాకెర గ్రామ శివారులో శివాలయ ప్రాంగణంలో వన మహోత్సవంలో భాగంగా అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 5లక్షల మొక్కలు నాటామని తెలిపారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వసతిగృహాలు, కిచెన్‌గార్డెన్, రహదారులు, రహదారులు ప్రాజెక్టులతో పాటు ఆయా ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. అనంతరం జాఫ్రాపూర్ గ్రామంలోని పంట పొలాల్లో వ్యవసాయ అధికారులు నిర్వహిస్తెన్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. సాగు విస్తీర్ణం, పంట నమోదు, దిగుబడి తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. గడువులోగా నిర్దేశించిన నమోదు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ రైతు నుంచి పంట సాగు, విస్తీర్ణాన్ని నమోదు చేయాలని సూచించారు. రైతులు దిగుబడి సాధించేలా సూచనలు, సలహాలను అందించాలన్నారు. డీఆర్డీవో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో గోవింద్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్ మల్లేష్, తదితరులు ఉన్నారు.


తయారు చేసిన పేపర్ కవర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్ వినియోగంతో దుష్పరిణామాలు

భైంసా, జూలై 12: ప్లాస్టిక్ వినియోగంతో దుష్పరిణామాలు జరుగుతాయని భైంసా మండలం మహాగాం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవదాస్, ఉపాధ్యాయుడు కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో పేపర్ సంచుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగంతో అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలపై కూడా ప్రభావం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగంతో కలిగే దుష్ఫలితాపై గ్రామీణ ప్రాంతాలవాసులను చైతన్యపరచి జాగృతం చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పేపర్లతో కవర్లు తయారుచేసి గ్రామస్థులకు పంపిణీ చేశారు. ఇందులో ఉపాధ్యాయులు నరేందర్ రెడ్డి, హరీష్‌లతోపాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన లక్కడి జగన్మోహన్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, జూలై 12: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్‌ను సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సాయిబాబా చిత్రపటాన్ని అందజేశారు. నిర్మల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మల్‌లోని గండిరామన్న క్షేత్రంలోని సాయిబాబా ఆలయ ప్రాశస్త్యాన్ని కలెక్టర్‌కు వివరించి ఆలయ సందర్శనకు రావాలని కోరారు.


కలెక్టర్‌కు సాయిబాబా చిత్రపటాన్ని అందజేస్తున్న లక్కడి

విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

• భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్


కుంటాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఏఎస్పీ

కుంటాల, జూలై12: పోలీసు సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. శుక్రవారం కుంటాల పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయనకు పోలీసుల గౌరవవందనం చేశారు. మొక్కల పెంపకం వలన కలిగే లాభాలను ప్రజలకు వివరించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పాతనేరస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలపై ప్రత్యేకనిఘా ఉంచాలని పోలీసులకు సూచించారు. కేసులు పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో రోజువారి పెట్రోలింగ్ సక్రమంగా నిర్వహించాలన్నారు. కుంటాల మండలం మహారాష్ట్ర సరిహద్దులో ఉన్నం దున సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నిఘా పె ంచాలని అన్నారు. రోజువారి వాహనాల తనిఖీ సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతీ ఒక్కరికి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీఐ నైలు, ఎస్ఐ రజనీకాంత్, ఏఎస్ఐలు పోలీసు సిబ్బంది ఉన్నారు.


మొక్కలు నాటుతున్న దృశ్యం

పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి

• ఎంపీడీవో రాములు నాయక్

ముథోల్, జూలై12: పర్యావరణ పరిరక్షణలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని ఎంపీడీవో రాములు నాయక్ అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌తోపాటు మండలంలోని చింతకుంట, ఎడ్‌బిడ్, తరోడా, తదితర గ్రామాల్లో శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వనమహోత్సవం కార్యక్రమంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. భావితరాలకు మనమిచ్చే ఆస్తి స్వచ్ఛమైన పర్యావరణమేనని అన్నారు. నాటిన మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకున్నప్పుడే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పాఠశాలలు, గ్రామ పంచాయతీ పరిధిలోని రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈవో మైసాజి, ఏపీవో శిరీషారెడ్డి, కార్యదర్శి అనూష, ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ కల్చరల్, జూలై12: నిర్మల్ టౌన్, ఆదర్శనగర్, దివ్యనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు కొనసాగుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షేమ వసతిగృహాల సమస్యలు పరిష్కరించాలి

• విద్యార్థి జన సమితి రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్

భైంసా, జూలై12: కాలయాపనకు తావులేకుండా జిల్లా పరిధిలోని సంక్షేమ వసతి గృహాల్లో నెలకొని ఉన్న సమస్యలన్నింటిని త్వరితగతిన పరిష్కరించాలని విద్యార్థి జన సమితి రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంబంధిత విషయంలో భైంసా రెవెన్యూడివిజన్ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి ఆర్డీవో కోమల్ రెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలన్నీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వసతుల లేమి, సౌకర్యాల కరువుతో వసతి గృహాల్లోని విద్యార్థులు నిత్యం సమస్యలతోనే సహవాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సంక్షేమ వసతి గృహలన్నింటికి స్వంత భవనాలు నిర్మించాలని, స్వంత భవనాలు ఉన్న వసతి గృహాల్లో పూర్తిస్థాయి వసతులు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరంచేస్తామని వెల్లడించారు. ఇందులో యూనియన్ భైంసాడివిజన్ ప్రతినిధులు గణేష్, శక్తిమాన్, నాగేష్, విక్రమ్, ఆర్యన్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు